క్లుప్తంగా

నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నెముక, నరాలు, తిమ్మిర్లు, వంటి, ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. అలాగే కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బుల సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పరీక్షా సామగ్రి పంపిణీ


పరీక్షా సామగ్రిని అందజేస్తున్న సమితి సభ్యుడు సునీల్

వీరపునాయునిపల్లె : పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రాణదాత సేవా సమితి ఆధ్వర్యంలో సమితి సభ్యుడు సునీల్ శనివారం పరీక్షలకు సంబంధించిన సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీలో గత ఏడాదికంటే ఎక్కువ స్థానాలను కైవసం చేసుకోవడంతో పాటు ఉరుటూరు పాఠశాల ఉనికిని రాష్ట్రస్థాయిలో కనిపించేలా పట్టుదలతో కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడిని జయించాలి



నందిమండలం హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ అనురాధ

పెండ్లిమర్రి : పదవ తరగతి చదివే విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడిని జయించి లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఎం.అనురాధ అన్నారు. మండలంలోని నంది మండలం జిల్లా పరిషత్ హైస్కూల్, ఇసుకపల్లె ఎంపీపీ స్కూల్‌ను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులు లక్ష్యం వైపు దూసుకెళ్లి ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. ఏమైనా అపోహలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఎంఈఓ సుజాత పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో ప్రజలకు మెరుగైన సేవలు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి తెలిపారు. శనివారం మైలవరం మండలంలోని దొడియం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలను ఎమ్మెల్సీలు పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, రమేష్ యాదవ్‌లతో కలసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ చేరెడ్డి సావిత్రి, రాష్ట్ర హార్టికల్చర్ సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ మహాలక్ష్మీ, సర్పంచ్ నారపురెడ్డి జగదీశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చేరెడ్డి చెన్నకేశవరెడ్డి, విష్ణు, రామాంజనేయ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


ఈఈ గంగయ్యను సన్మానిస్తున్న గండి ఆలయ అధికారి ముకుందరెడ్డి

చక్రాయపేట : దేవదాయ శాఖ డీఈగా పని చేస్తు ఈఈగా పదోన్నతి పొందిన గంగయ్యను శనివారం గండి దేవస్థానం సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి ఆధ్వర్యంలో ఘణంగా సన్మానించారు. ఈఈ హోదాలో గండి అభివృద్ధి పనుల పరిశీలనార్థం వచ్చిన ఆయనకు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన, ఉపప్రధాన ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు ఆలయ సిబ్బంది, ఏఈ నిఖిల్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కడప కార్పొరేషన్: అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. శనివారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన ఈట్ స్ట్రీట్, అక్కాయపల్లె పార్కు, శాస్త్రి నగర్ పార్కులను పరిశీలించారు. నగరపాలక ఇంజినీరింగ్, హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో వలంటీర్లే కీలకం

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి


పెండ్లిమర్రిలో వలంటీరుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి


జమ్మలమడుగులో వలంటీర్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, చైర్‌పర్సన్

పెండ్లిమర్రి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారులకు చేరవేయడంలో వలంటీర్లే కీలకమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో సభా భవనంలో శనివారం నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో ప్రతి రెండు వేల జనాభాకు ఒక గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకవచ్చి సచివాలయంలో ప్రజలకు అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంచి ప్రతి 50 ఇండ్లకు ఒక వలంటీరును ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు వారి ద్వారా ప్రజలకు అందజేయడం ప్రశంసనీయమన్నారు. వలంటీర్ల సేవలను గుర్తించి సీఎం జగన్ సేవా వజ్ర కింద రూ.45 వేలు, సేవా రత్న కింద రూ.30 వేలు, సేవా మిత్రకు రూ.15వేలు అదనంగా అధిస్తున్నాడన్నారు. అనంతరం సేవా వజ్ర కింద ఇద్దరు, సేవా రత్న కింద ఐదుగురు వలంటీర్లకు పురస్కారాలు అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైఎస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ చంద్రారెడ్డి, ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, జెసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్ నాగమల్లారెడ్డి, మాజీ సర్పంచ్ రఘునాథ్‌రెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

ప్రజలకు ప్రభుత్వానికి వారధులు వలంటీర్లు

జమ్మలమడుగు : ప్రజలకు–ప్రభుత్వానికి మధ్య వారధులుగా విధులను నిర్వహిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకాన్ని నిరుపేదలకు చేర్చిన ఘనత వలంటీర్లకు దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో అవార్డు పొందిన వలంటీర్లకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి కరోనా బారిన పడిన వారిని గుర్తించి, వారికి మందులను సరఫరా చేసి ఎందరో ప్రజల ప్రాణాలను వలంటీర్లు కాపాడారని కొనియాడారు. వలంటీర్ల వ్యవస్థ ఉండటం ద్వారా సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు చేరుతున్నాయన్నారు. వలంటీర్లు జగనన్న సైనికులుగా పనిచేశారన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఒకటో తేదీ వచ్చిందంటే తెల్లవారకముందే లబ్ధిదారులకు పెన్షన్ అందుతోందన్నారు. వలంటీర్ల సేవలద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంటే ప్రతిపక్ష పార్టీలు వారి మీద విషం కక్కడం జరుగుతుందన్నారు. దేశమంతా వలంటీర్ల సేవ గురించి కొనియాడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించడం కోసం ప్రతి వలంటీర్ తన వంతు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. అనంతరం చైర్ పర్సన్ వేల్పుల శివమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ నేడు దేశంలోని అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. భవిష్యత్తులో కూడా వలంటీర్ వ్యవస్థ కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎస్.ప్రమోద్‌కుమార్, వైస్ చైర్మన్ సింగరయ్య, కౌన్సిలర్లు పోచిరెడ్డి, షామీర్, కో ఆప్షన్ సభ్యుడు లక్షుమయ్య, మెప్మా అధికారి గంగులయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : మున్సిపల్ కార్యలయ ఆవరణలో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించిన వలంటీర్లకు సేవాపురస్కారాల కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టరు మూలె సుధీర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. పట్టణ పరిధిలోని 177 మంది గాను ఐదు మందికి సేవారత్న, మిగిలిన వారందరికి సేవామిత్ర పురస్కారాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రామకృష్ణ, కో–ఆప్షన్ సభ్యులు డి. సూర్యనారాయణరెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పెద్దముడియంలో రక్తదాన శిబిరం

పెద్దముడియం : స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, మానవత పెద్దముడియం శాఖ వారి ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారిచే రక్తదాన శిబిరాన్ని పెద్దముడియంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో 80 మందికి పైగా యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీజీబీ ఆర్ఎం పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ ఒకరి రక్తదానం ముగ్గురి ప్రాణాలు కాపాడుతుంది, ప్రతి 3 నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చునన్నారు. రక్తదానం చేయటం వలన శరీరానికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని ప్రతి ఒక్కరూ రక్తదానం చేయుటకు మందుకు రావాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నారై టి.సదాశివారెడ్డి, ఏపీజీబీ మాజీ ఆర్ఎం శివశంకర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

సిద్ధం సభకు తరలిరండి

లింగాల : అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించే సిద్ధం బహిరంగ సభకు ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి రావాలని ఎంపీపీ రమాదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి.వి.సుబ్బారెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా సిద్ధం సభకు తరలి వచ్చి జయప్రదం చేయాలని వారు కోరారు.

జగనన్నతో ప్రతి కుటుంబానికి మేలుజరిగింది


వికలాంగుడు రంగస్వామికి పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : జగనన్న ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలతో మేలు జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. శనివారం మోరగుడి గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి నిర్వహించిన గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలతో ప్రజలు పొందిన లబ్ధిని వారికి వివరించారు. అనంతరం వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు తిరిగి కొనసాగాలంటే అది ఒక్క జగనన్నతోనే సాధ్యమన్నారు. సంక్షేమ పథకాల వల్ల ప్రజలు లబ్ధిపొందిఉంటే వైఎస్సార్‌సీపీకి మరో అవకాశం కల్పించాలన్నారు. తాను వైద్యుడిని తనకు ప్రాణం పోయడమే తప్ప ప్రాణాలను తీయడం తెలియదన్నారు. గతంలో ఉన్న నాయకులు ఫ్యాక్షన్ ను ప్రోత్సహించి ఎప్పుడు ఎమి జరుగుతుందో అంటూ ప్రజలు భయపడేవిధంగా పాలన సాగించారన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎంపికైనప్పటి నుంచి చిన్న సంఘటనలు కూడా నియోజకవర్గంలో జరుగలేదన్నారు. టీడీపీ పాలనలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చారన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా తన వల్ల లబ్ధిపొంది ఉంటేనే తనకు ఓటు వేయండి అని ప్రజలను అడగలేదన్నారు. ఒక్క జగనన్న మాత్రమే అలా అడుతున్నాడన్నారు. అలాంటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్ఆర్‌సీపీలోకి చేరిక


పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎస్.కొండారెడ్డి

చక్రాయపేట : స్థానిక పాతదళితవాడ, నాగిరెడ్డిపల్లె, తిమ్మారెడ్డిపల్లెకు చెందిన పలువురు శనివారం తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చక్రాయపేట గ్రామ మాజీ సర్పంచ్ మల్లేపల్లె పెద్ద రామయ్య, చిన్నరామయ్య, గంగులయ్య, దేవభాస్కర్, సీమోన్, చెన్నారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, గంగులయ్య, గంగిరెడ్డి, సయ్యద్, వెంకటేసు, చిన్నవెంకటేసు, నాగరాజు, చిన్నరెడ్డెయ్య, రామ, రామచంద్ర, రామాంజులు, రామమోహన్ సుబ్బరాయుడులు పార్టీలో చేరారు. అలాగే యార్లవాండ్లపల్లెకు చెందిన చెన్నప్ప, నాగిరెడ్డిపల్లెకు చెందిన జయచంద్ర, రమణ, ఓబులేసు, పూజల వెంకటేసుతో పాటు మరికొన్ని కుటుంబాలు వైఎస్ఆర్‌సీపీలో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న, ఎంపీ అవినాష్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డిల సారథ్యంలో పనిచేయాలన్న సంకల్పంతో తాము వైఎస్ఆర్‌సీపీలో చేరినట్లు వారు తెలిపారు. జగనన్న ప్రభుత్వంలో తమకు లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శివప్రసాదరెడ్డి, ఎంపీపీ మాధవీబాలకృష్ణ, ఎంపీటీసీ శ్రీని వాసులు, సర్పంచ్ హర్షాద్, సింగిల్‌విండో అధ్యక్షుడు శేషారెడ్డి, పార్టీ నేతలు వెంకటసుబ్బారెడ్డి, గంగిరెడ్డి, ఈశ్వరరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, మధుసూదనరెడ్డి, గంగిరెడ్డి, ఏసోబు, బాబు ఓబులేసు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీరాముని పాదుకలకు ప్రత్యేక పూజలు


హోమ కార్యక్రమాల్లో పాల్గొన్న దంపతులు

వీరపునాయునిపల్లె : అయోధ్య నుంచి వీరపునాయునిపల్లె మండలం యరమలపల్లె గ్రామానికి చేరుకున్న శ్రీరాముని పాదుకలకు శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో భాగంగా లోక కల్యాణార్థం నిర్వహించిన 108 దంపతులతో 28 హోమాల్లో పాల్గొనేందుకు భక్తులు పోటెత్తారు. సంగమేశ్వరాలయ ప్రధాన అర్చకులు సుబ్రమణ్య శర్మ తమ శిష్య బృందంతో హోమ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న జాతీయ మంత్రి విశ్వ హిందూ మహాసభ అతిథి మహరాజ్, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ రాజరాజేశ్వరి, శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి జ్ఞాన పీఠం రాజ రాజేశ్వరానందస్వామి, అచల ప్రవక్త అచలపీఠం సుభోదానందస్వామి పాల్గొని హిందూ సాంప్రదాయం గురించి భక్తులకు వివరించారు. అనంతరం సీతా రామచంద్ర లక్ష్మణ సమేత ఉత్సవ మూర్తులను, శ్రీఆముని పాదుకలను గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో ఏర్పాటు చేసిన కోలాట కార్యక్రమం భక్తులను ఎంతగానో అలరించింది. కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు సహకరించిన వారికి లక్ష్మిచెన్నకేశవస్వామి ఆలయ నిర్వాహకులు ధన్యవాదాలు తెలియజేశారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

జమ్మలమడుగు : నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని, ఆదేవిధంగా పోలింగ్ కేంద్రాలలో కరెంటు సౌకర్యం, మౌలిక సదుపాయాలు కలిగి ఉండాలని ఆర్డీఓ శ్రీనివాస్, డీఎస్పీ యశ్వంత్‌లు తెలిపారు. శనివారం నియోజకవర్గంలోని తహసీల్దార్, మండల, పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న పోలింగ్ స్టేషన్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాలలో అసాంఘీక శక్తులుగా ఉన్నవారిని గుర్తించి వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. రాబోయే ఎన్నికలను పోలీసు, రెవెన్యూ అధికారులు కలిసి ప్రశాంత పోలింగ్ జరిగేవిధంగా చర్యలను చేపట్టాలన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు కలిసి సామరస్యంగా విధులను నిర్వహించాలన్నారు.

సామాజిక సేవ అభినందనీయం

కడప కార్పొరేషన్: విద్యుత్ ఉద్యోగులు సామాజిక సేవలో భాగస్వామ్యం అవడం అభినందనీయమని ఏపీఎస్పీడీసీఎల్ కడప సర్కిల్(ఆపరేషన్స్) ఎస్ఈ రమణ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆజాద్ నగర్‌లో బృందా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి రూ.30 వేలు విలువగల నిత్యావసర సరుకులను ఎస్ఈ రమణ ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు.

పెద్ద శేషవాహనంపై శ్రీవేంకటరమణుడు


పెద్ద శేషవాహనంపై శ్రీవేంకటరమణుడు


ఊంజల్ సేవలో స్వామివారు

పులివెందుల టౌన్ : పట్టణంలో వెలసిన వేంకటరమణుడి ఆలయంలో వైభవంగా నిర్వహిస్తున్న శ్రీపద్మావతి సమేత కల్యాణ వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి స్వామివారు పెద్ద శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక వాహనంలో స్వామివారిని రకరకాల పూలతో అలంకరించి పట్టణం పురవీధులైన మెయిన్ బజార్, పూలంగళ్ల సర్కిల్, గంగిరెడ్డి ఆసుపత్రి రోడ్డు, ముత్యాల వారి వీధి, గాడిచర్ల వీధి, అమ్మవారిశాల వీధుల మీదుగా గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. తమ ఇంటి ముంగిటకు స్వామివారు రాగానే భక్తిశ్రద్ధలతో భక్తులు కాయ, కర్పూరం, నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ఉదయం సుప్రభాత సేవ.. తోమాల సేవతోపాటు ధ్వజారోహణం చేపట్టారు. సాయంత్రం సహస్రనామార్చన, నివేదన, యాగశాల ప్రవేశం, పుణ్యాహక వాచనం, నిత్య హోమం, వాస్తు హోమంతోపాటు తదితర పూజలు నిర్వహించారు. ఉభయ దారులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సహస్ర దీపాలంకరన ఊంజల్ సేవలు నిర్వహించి స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు.

20వ తేదీన మటన్, చికెన్ షాపులకు వేలం

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలో ఉన్న మటన్, చికెన్ షాపుల బాడుగ వసూళ్లకు సంబంధించిన వేలం పాటను ఈనెల 20వ తేదీన మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలోని సుమారు 19 మటన్, చికెన్ షాపులు ఉన్నాయి. వీటిలో పాత మటన్ షాపులకు నెలకు రూ.4500, పాత చికెన్ షాపులకు నెలకు రూ.4000, నూతనంగా తాత్కాలిక చికెన్ షాపులకు నెలకు రూ.5000 బాడుగను నిర్ణయించామన్నారు. ఈ వెలంలో పాల్గొనదలిచిన వారు రూ.2 లక్షలు చెల్లించాలన్నారు. ఈ వేలం పాటను దక్కించుకున్న టెండర్ దారుడు 2025 వరకు గడువు ఉంటుందన్నారు. ఎవరైన టెండర్ల పాల్గొనదలిచిన వారు మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో అధికారులను సంప్రదించాలన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

జమ్మలమడుగు : మున్సిపాలిటీలో దోమల నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రమోద్‌కుమార్ తెలిపారు. శనివారం రాత్రి పట్టణంలోని 9, 7 వార్డుల్లో దోమలనివారణ కోసం ఫాగింగ్ చేపట్టామని మున్సిపాలిటీలోని అన్ని వీధుల్లో ఫాగింగ్ చేస్తామన్నారు. అలాగే కాలువల్లో ఉన్న పూడికలను తొలగించే కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నామన్నారు. స్థానిక కౌన్సిలర్లు ఎక్కడైనా సమస్యలుంటే తమకు తెలిపితే వెంటనే వాటిని పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటేషన్ అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకం లాభదాయకం

వైవీయూ : పుట్టగొడుగుల పెంపకం లాభదాయకమని వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం యోగివేమన విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పుట్టగొడుగుల పెంపకంను అనంతపురం జిల్లా ఎస్.ఎస్.బి.ఎన్. డిగ్రీ కళాశాల విద్యార్థులు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మార్కెట్ విలువ ఉండే పుట్టగొడుగుల పెంపకంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో గ్రామీణ ప్రాంతాల్లో పుట్టగొడుగుల పెంపకాన్ని చిన్నతరహా పరిశ్రమగా ప్రారంభించవచ్చని సూచించారు. బయోటెక్నాలజీ శాఖ ఆచార్యులు డా. చంద్రమతీశంకర్ మాట్లాడుతూ పుట్టగొడుగుల పెంపకం ప్రాథమిక దశ నుంచి మార్కెటింగ్ వరకు ప్రయోగాత్మకంగా శిక్షణతో పాటు అవగాహన కల్పించారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎన్జీఓ హోం నుంచి ర్యాలీ చేపట్టారు. శివాలయం సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ తాలూకా చైర్మన్ కేజే రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఐఆర్ 30 శాతం ప్రకటించాలని, పెండింగ్ డీఏలను చెల్లించాలని తెలిపారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏపీ జేఏసీ కన్వీనర్ రామసుబ్బయ్య, ఉమెన్స్ వింగ్ ప్రెసిడెంట్ జయమ్మ, కన్వీనర్ సుజాత, పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు జయరామిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఉత్సవమూర్తుల గ్రామోత్సవం


గ్రామోత్సవంలో శ్రీసీతారాముల,లక్ష్మణ, ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులు

వేముల : మండలంలోని పెర్నపాడు గ్రామంలో శ్రీసీతారాముల, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. రెండవ రోజు ఈ సీతారాముల, లక్ష్మణ, ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తులకు శనివారం గ్రామోత్సవం నిర్వహించారు.

అంతకముందు గ్రామంలో నూతనంగా నిర్మించి రామాలయంలో శ్రీసీతారాముల, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలకు, ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు గడియారపు కిరణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు విగ్రహ ప్రతిష్ట వేడుకలను శాస్త్రోయుక్తంగా నిర్వహిస్తున్నారు. గ్రామంలో విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని ఒంగోలు వారిచే ఏర్పాటు చేసిన మహిళల కోలాటం భక్తులను ఆకట్టుకుంది. విగ్రహ ప్రతిష్టకు విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద ఏర్పాట్లు చేశారు. విగ్రహ ప్రతిష్టతో గ్రామంలో బంధువులు, స్నేహితులు, ఆప్తులతో పండుగ వాతావరణం నెలకొంది.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మిషన్ల కొరకు ప్రచారం


కరపత్రాలతో వేంపల్లె వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం నూతన విద్యా విధానం–2020 అనుసరించి 2024–25 డిగ్రీ అడ్మిషన్ల కొరకు అవగాహన కల్పించడానికి అధ్యాపక బృందం విభిన్న ప్రాంతాలలో జూనియర్ కళాశాలలను సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు ఆధ్వర్యంలో భౌతికశాస్త్ర అధ్యాపకుడు ఓబుళరెడ్డి, సివిక్స్ అధ్యాపకుడు ప్రసాద్‌లు పులివెందులలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, నిడివెల్లలోని కస్తూర్బా ప్రభుత్వ జూనియర్ కళాశాల, తొండూరులోని బాలయోగి గురుకుల కళాశాల సందర్శించి కరపత్రాలను పంపిణీ చేసి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. అన్ని సదుపాయాలు కలిగిన వేంపల్లె వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారులకు వీల్‌చైర్స్ ఎంతో ఉపయోగకరం


దివ్యాంగ చిన్నారులకు వీల్ చైర్లను అందిస్తున్న ఎంపీడీఓ దివిజా సంపతి

వేంపల్లె : చిన్నారులకు వీల్‌చైర్స్ ఎంతో ఉపయోగపడుతాయని ఎంపీడీఓ దివిజా సంపతి తెలిపారు. శనివారం విద్యాశాఖ, అలింకో సంస్థ ఆధ్వర్యంలో వివిధ లోపాలతో బాధపడుతున్న వారిని గుర్తించి దాదాపు 5 మంది చిన్నారులకు వీల్‌చైర్స్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగ చిన్నారులకు వీల్‌చైర్స్ ఎంతో ఉపయోగకరమని.. వీటిని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. దివ్యాంగ విద్యార్థులలో ఆత్మ స్థైర్యం పెంపునకు ఉపయోగపడుతాయన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న దివ్యాంగ చిన్నారికి రూ.1000ల నగదును ఎంఈఓ జాఫర్ సాధిక్ అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 స్టాలిన్ ఐజాక్, ఐఈఆర్టీలు యశోధ, సుజాత, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ఆనంద్, హెచ్ఎం రాజేశ్వరమ్మ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పదవీ వ్యామోహంతోనే వరద విమర్శలు

ప్రొద్దుటూరు : కేవలం పదవీ వ్యామోహంతోనే మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక రెండో వార్డు కౌన్సిలర్ ద్వార్శల భారతి స్వగృహంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన స్వార్థ రాజకీయాల కోసం వరదరాజులరెడ్డి ఎంతో మందిని నాశనం చేశారని ఘాటుగా విమర్శించారు. భూమి కోసం బ్రాహ్మణుడిని పెట్రోలు పోసి సజీవ దహనం చేయడం, దానికి సంబంధించి హైదరాబాద్‌లో కేసు నమోదు అయిందన్నారు. ఈ కేసులో వ రద తనయుడు కొండారెడ్డి పేరు నమోదు చేయగా అధికార పార్టీ బలంతో కేసు నుంచి తప్పించారన్నారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య కుమారుడు వీరప్రతాప్, మరికొంత మందిని కేసులో పెట్టారన్నారు. ఓ వైపు మాజీ ఎమ్మెల్యే ఎంవీ రమణారెడ్డి, మరో వైపు మల్లెల లింగారెడ్డి ఇలా ఎవరిని పడితే వారిని విమర్శించడం, అవసరమైతే మళ్లీ వాడుకోవడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని తెలిపారు. చెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన భూమిని వరద అల్లుడు రామచంద్రారెడ్డి అమ్ముకునేందుకు బేరం పెట్టిన విషయం అందరికీ తెలుసునన్నారు. డీఏడబ్ల్యూ కళాశాలకు చెందిన 10 ఎకరాల భూమిలో ఎలా నిర్మాణాలు చేపడుతున్నారని ప్రశ్నించారు. తనకు ఓటు వేయలేదని ప్రజలను సైతం డెకాయిట్ అని వరద అన్న వీడియోలు తన వద్ద ఉన్నాయన్నారు. ఐదు మార్లు ఎమ్మెల్యేగా గెలిచి, రెండు మార్లు ఓడిపోయినంత మాత్రాన ప్రజలను విమర్శిస్తే ఎలా అని ప్రశ్నించారు. ఇదే సీఎం సురేష్ నాయుడు కుటుంబాన్ని విమర్శించిన వరద మళ్లీ ఇప్పుడు కలసి పనిచేస్తున్నారన్నారు.